
సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం। 23। ఫిబ్రవరి। 2024



ఇంద్రజాలం.. మనసుకు గాలం

ఒకనాడు మ్యాజిక్‌షోలు ఉర్రూతలూగించాయి. నేడు ఆదరణ తగ్గింది. నేడు పీసీ సర్కార్ జయంతి.

-IIలో



విద్యుత్ షాక్‌తో..

విద్యుత్ షాక్‌తో ఓ లైన్‌మెన్ మృతి చెందారు. పెదరోకళ్లపల్లి పంచాయతీలో ఘటన జరిగింది.

-IIలో

'అన్ని భాషలు గొప్పవే'

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రపంచంలో అన్ని భాషలు గొప్పవేనని, మాతృభాష చాలా కమ్మనైనదని ఆంధ్రాయూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పర్వతనేని సుబ్బారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 'మానవ భాష ఆవిర్భావం- పరిణామ వికాసం' అనే అంశంపై ఉపన్యసించారు. జంతుజాలం నుంచి మనిషిని వేరు చేసిన గొప్ప సాధనం భావయేనని చెప్పారు.

న్యూస్‌రీల్

కౌంటింగ్ కోసం గదుల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ నిర్వహణ కేంద్రాల కోసం గదులను ఎచ్చెర్ల తహసీల్దార్ వి.శ్యామ్‌కుమార్‌తో కూడిన రెవెన్యూ అధికారులు బృందం గురువారం పరిశీలించింది. జిల్లాలోని 8 నియోజకవర్గాల ఈవీఎంలు ఇక్కడే భద్రపర్చనున్నారు. ఈ మేరకు స్ట్రాంగ్ రూంలు జిల్లా అధికారుల సూచనలు మేరకు సిద్ధం చేస్తున్నారు. కౌంటింగ్ కోసం విశాలంగా ఉన్న గదులు సిద్ధం చేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల 309 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్ల స్వీకరణ, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం శ్రీ శివానీలోనే నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లోనూ ఇక్కడే కౌంటింగ్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పరీక్షల నిర్వహణపై దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెన్త్, ఇంటర్, డీఎస్సీ, టెట్ నిర్వహణపై తాడేపల్లిలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్ గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. ఆయా పరీక్షలు జరిగే తేదీల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్, డీఈఓ వెంకటేశ్వర రావు, విద్యాశాఖ పరీక్షల సహాయ కమిషనర్ ఆలీఖాన్, ఆర్‌ఐఓ దుర్గారావు, డీవీఈఓ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ బంగ్లాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ

అరసవల్లి: ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని జిల్లాలో ఉన్న ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో వాచ్‌మెన్‌లు, అటెండర్లు, శానిటేషన్ వర్కర్లు తదితర పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గల అర్హులు వచ్చేనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను స్థానిక సాయిబులతోట వద్ద ఉన్న ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

వింత వ్యాధితో కోళ్లు మృతి



మృతి చెందిన కోళ్లు

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో ఇళ్లలో పెంచుకున్న నాటు కోళ్లు వింత వ్యాధి సోకి చనిపోతున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు రోజులుగా ఆ గ్రామానికి చెందిన పొన్నాన పద్మ, కొట్టు భారతి, రావాడ చిన్నమ్ముడు, రాయి నారాయణమ్మలతో పాటు పలువురికి చెందిన సుమారు 50 కోళ్ల వరకు చనిపోయాయి. చక్కగా తిరుగుతున్న కోళ్ల రెక్కలు కొట్టుకుంటూ మృత్యువాత పడుతున్నాయని వారు చెబుతున్నారు. దీనిపై చీడిపూడి పశు వైద్యులు కిశోర్‌తో మాట్లాడగా.. గ్రామానికి వెళ్లి కోళ్ల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించామని, వ్యాధి నిర్ధారణ చేశాక మందులను మిగత కోళ్లకు అందిస్తామని చెప్పారు. ఇటీవల గుమ్మపాడు గ్రామంలో ఈ విధంగా కోళ్లు మృత్యువాత చెందాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా.. చనిపోయిన కోడికి పోస్టుమార్టం నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసి మందులు అందజేసినట్లు ఆయన తెలిపారు.



అరసవల్లి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల



డ్యూయల్ డెస్కులతో తరగతి గది



గర్వంగా నిలబడింది చూడు..



అరసవల్లి:

ఆ ప్రధానోపాధ్యాయుడికి చూపులేదు. కానీ బడి బాగుపడిన తీరు అందరి కంటే ఆయనకే ఎక్కువగా అర్థమైంది. కొత్తగా కట్టిన భవనాలు, ప్రహరీలు, టాయిలెట్లు ఏవీ ఆయన కంటికి కనిపించవు. కానీ ఆ మౌలిక సదుపాయాల ప్రాధాన్యత ఆయనకే ఎక్కువగా తెలుస్తోంది. 'సార్.. మంచినీరు లేవు సార్' అన్న ఫిర్యాదు వినీ వినీ విసుగెత్తిపోయిన హెచ్‌ఎంకు ఆ మాటే ఇప్పుడు వినిపించడం లేదు. 'సార్.. బాత్‌రూమ్‌లో నీళ్లు లేవండీ..' అని పిల్లలు చెబితే ఏమీ చేయలేక ఎన్నో ఏళ్లు నిస్సహాయంగా ఉండిపోయిన ఆ ప్రధానోపాధ్యాయుడికి ఆ సమస్య ఇప్పుడు చెవిన పడడం లేదు. ఇది వరకు రాత్రయితే చాలు ఆకతాయిలు వచ్చి బడి గదుల్లో ఇష్టానుసారం ప్రవర్తించేవారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటైన ప్రహరీ వారిని బడికి రాకుండా ఆపింది. నాడు–నేడు పుణ్యాన అరసవల్లి బడి అందంగా మారింది. మరీ ముఖ్యంగా అంధుడైన ప్రధానోపాధ్యాయుడి మనోనేత్రానికి తెలిసేంత మార్పులు ఇక్కడ చోటు చేసుకున్నాయి. ముప్పై ఏళ్లుగా సదుపాయాల కోసం ఎదురు చూస్తున్న అరసవల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాల ఈ ప్రభుత్వ హయాంలో మరమ్మతులకు నోచుకుంది. ఎన్నో ఏళ్ల అవస్థలు దాటుకుని గర్వంగా నిలబడింది.



ఆధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లు



కళావేదిక ఇదే

స్వాతంత్య్ర భారతంలో అద్భుత నిర్ణయమిది..



ఇరవై ఏళ్ల కిందట ఇదే బడిలో మా అమ్మ హెచ్‌ఎంగా పనిచేశారు. అప్పట్లో నేను ఇంగ్లిష్ అసిస్టెంట్‌ను. మళ్లీ నేను 2012లో హెచ్‌ఎంగా ఇక్కడకే వచ్చాను. కానీ ఈ పాఠశాల తీరు ఏ మాత్రం మారలేదు. మరుగుదొడ్లు లేవు. తాగునీరు లేదని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వచ్చేవి. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని తోటి ఉపాధ్యాయుల ఆవేదన వినిపించేది. ఏడాదికి రూ.50 వేలు నిధులు రావడం గగనమైన పరిస్థితులుండేవి. సమస్యలకు శాశ్వత పరిష్కారం గత పాలకులెవ్వరూ చూపలేదు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఒక బడికి పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించడం అనేది ఇప్పుడే జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు అద్భుతం. పిల్లలు చదువుకోవడానికి తగిన వాతావరణం కల్పిస్తేనే లక్ష్య సాధనకు అవకాశం దొరుకుతుంది. ఇప్పుడు మా పాఠశాలలో సౌకర్యాలు లేవు అన్న ప్రశ్నే లేకుండా రూ.53 లక్షలతో అభివృద్ధి చేశారు. నిజంగా నాతో పాటు నా తోటి ఉపాధ్యాయులు కూడా పాఠశాలలో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఇక పాఠశాలలు మొదలైతే విద్యార్థుల ఆనందోత్సాహాలు రెట్టింపవుతున్నాయి. మునుపెన్నడూ చూడని ఆహ్లాదం ఇప్పుడు కనిపిస్తోంది. నా కళ్లు ఈ లోకాన్ని చూడకపోయినా..నా పాఠశాల రూపురేఖలన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

– టీఎస్‌వీ భరద్వాజ్, ప్రధానోపాధ్యాయుడు, అరసవల్లి

పాఠశాల	నాడు–నేడు కింద ఖర్చు చేసిన నిధులు	కొత్తగా ఏర్పాటు చేసిన సదుపాయాలు
అరసవల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాల	రూ.53 లక్షలు	ఆధునిక మరుగుదొడ్లు, మంచినీటి కుళాయిలు, ఫెన్సింగ్‌తో కూడిన ప్రహరీ, గ్రానైట్ ఫ్లోరింగ్, గ్రీన్ బోర్డు, డ్యూయల్ డెస్కులు, పూర్తి స్థాయి త్రిఫేజ్ విద్యుత్ సౌకర్యం, రంగురంగుల బొమ్మలతో పాఠశాల కళా ప్రాంగణం.

100/100 సాధిద్దాం



నరసన్నపేటలోని దేశవానిపేట హాస్టల్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- వసతి గృహాల్లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి
- బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో 1163 మంది విద్యార్థులు
- గత ఏడాది బీసీ వసతి గృహాల్లో 87 శాతం ఉత్తీర్ణత
- ఎస్సీ వసతి గృహాల్లో 74 శాతం ఉత్తీర్ణత

నరసన్నపేట:

వసతి గృహాలు వందకు వంద టార్గెట్ పెట్టుకున్నాయి. పదో తరగతిలో ఎలాగైనా నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని కృషి చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను ఇప్పటికే సర్కారు అందంగా తీర్చిదిద్దింది. దీంతో పాటు వసతి గృహాలను సైతం బాగు చేసింది. ఇక్కడ ఇదివరకు కంటే భోజన సదుపాయాలు మెరుగయ్యాయి. గదులు, మరుగు దొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు వంటి సౌకర్యాలు బాగున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న పదో తరగతి విద్యార్థులు పూర్తి స్థాయిలో ఉత్తీర్ణత పొందేలా అటు బీసీ వెల్ఫేర్ అధికారులు, ఇటు సోషల్ వెల్ఫేర్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ లక్ష్యంతోనే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గత ఏడాదితో పోల్చితే మంచి ఫలితాలు వస్తాయనే నమ్మకంతో ఉన్నారు.

1163 మంది పరీక్షలకు హాజరు

జిల్లాలో బీసీ, ఎస్సీ విభాగాల్లో ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 79 ఉన్నాయి. వీటిల్లో 1163 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో బీసీ వసతి గృహాల్లో విద్యార్థులు 87 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, ఎస్సీ వసతి గృహాల్లో 74 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే బీసీల్లో 84 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు పొందారు. ఒక అమ్మాయికి 575మార్కులు వచ్చాయి. అలాగే ఎస్సీ విభాగంలో కూడా విద్యార్థులు మంచి మార్కులనే పొందారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 2023–24 విద్యా సంవత్సరంలో కూడా వసతి గృహాల్లో ఉత్తీర్ణత శాతం మెరుగు పరిచేందుకు అన్ని చర్యలను తీసుకుంటున్నారు.

ప్రత్యేక తరగతులు

- ఎంపిక చేసిన వసతి గృహాల్లో ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేశారు.
- నాలుగైదు వసతి గృహాలకు చెందిన విద్యార్థులను ఒక చోట చేర్చి నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
- అలాగే ఎస్సీ విభాగంలో అయితే వసతి గృహాల్లో చదువుకుని మంచి మార్కులు పొందిన విద్యార్థులను తీసుకువచ్చి వారి అనుభవాలు, మెలకువలు ప్రస్తుత విద్యార్థులకు వినిపించారు.
- బీసీ విభాగంలో నరసన్నపేట, సంతబొమ్మాళి, సింగుపురం, పలాసల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక క్లాసులు బాగున్నాయి..



నేను పోలాకి బీసీ బాలుర హాస్టల్‌లో చదువుతున్నాను. రోజూ టీచర్లు వచ్చి ప్రత్యేక క్లాసులు చెబుతున్నారు. నాలుగైదు వసతి గృహాలకు ఒకే చోట ప్రత్యేక క్లాసులు కూడా చెప్పించారు. హాస్టల్‌లో చదువుకోవడానికి అన్ని సౌకర్యాలు బాగున్నాయి. భోజనం కూడా బాగుంటుంది.

– చక్క బాలకృష్ణ, బీసీ బాలుర వసతి గృహం, పోలాకి

సౌకర్యాలు బాగున్నాయి



వసతి గృహంలో సౌకర్యాలు బాగున్నాయి. దీంతో చదువుపై దృష్టి పెడుతున్నాం. వసతి గృహంలో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. స్కూల్స్‌లో కూడా ఉపాధ్యాయులు దత్తత తీసుకొని పదో తరగతికి సిద్ధం చేస్తున్నారు. 500పైగా మార్కులు సాధిస్తాననే నమ్మకం ఉంది.

– రాజాన రాణి, ఎస్సీ బాలికల హాస్టల్, నరసన్నపేట

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



జిల్లాలో 63 ప్రీ మెట్రిక్ హాస్టల్స్ ఉన్నాయి. వీటిల్లో 59 హాస్టల్స్‌లో 891 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. గత ఏడాది మంచి ఫలితాలే సాధించారు. దాని కంటే మెరుగైన ఫలితాలు ఈ ఏడాది సాధించడానికి కసరత్తు చేస్తున్నాం. పలు చోట్ల ప్రత్యేక క్లాసులు పూర్తి చేశాం.

– ఇ.అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖాధికారి

మెలకువలు చెప్పిస్తున్నాం..



జిల్లాలో ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లు 20 ఉండగా పదో తరగతి విద్యార్థులు 272 మంది ఉన్నారు. వీరంతా పాసయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇదివరకు ఇక్కడ చదివి మంచి మార్కులు తెచ్చుకున్న వారిని రప్పించి వారి అనుభవాలు, మెలకువలు చెప్పిస్తున్నాం. మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నాం.

– విశ్వమోహనరెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్, శ్రీకాకుళం

చిరకాల ఉషస్సు



మృతదేహం వద్ద విషణ్ణ వదనంతో కుటుంబ సభ్యులు

- జెమ్స్‌లో మరోసారి అవయవదానం



ఉషారాణి

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో మరోసారి అవయవదానం జరిగింది. పాతపట్నం మండలం పెదలోగిడి గ్రామానికి చెందిన జైనవలస ఉషారాణి (40) ఈ నెల 19న ఓ శుభకార్యానికి వెళ్తూ హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వెంటనే ఆమెను శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడే మూడు రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్సను అందజేశారు. కానీ అప్పటికే ఆమె అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వైద్యులు చూశాక బ్రెయిన్ పూర్తిగా పనిచేయడం లేదని తెలిసింది. దీంతో ఇదే విషయాన్ని ఆమె భర్త కృష్ణారావు, పిల్లలు నిఖిత, పల్లవి, జోషిత్‌లకు తెలియజేశారు. ఉషారాణి అవయవాలను వేరొకరిలో చూసుకోవచ్చని జీవన్‌దాన్ సంస్థను గురువారం కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

లివర్‌ను విశాఖపట్నంలోని పినాకిల్‌కు, కిడ్నీని విశాఖ కేజీహెచ్‌కు, కళ్లను రెడ్‌క్రాస్‌కు, మరో కిడ్నీని శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి అందించారు. మృతదేహానికి జెమ్స్ ఆసుపత్రి వైద్యులు, విద్యార్థులు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఏఓ రామ్మోహన్, డైరెక్టర్ డాక్టర్ సుధీర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అశోక్‌రెడ్డి, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ శివ అన్వేష, ఆర్‌ఎంఓలు డాక్టర్ బాలమురళీ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు



వీసీలో పాల్గొన్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్లు సమర్పించేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వెబ్ సైట్‌ను రూపొందించిందని రాష్ట్ర ఎన్నికల అదనపు కమిషనర్ ఎం.ఎన్. హరీందర్ ప్రసాద్ తెలిపారు. నిర్ణీత నమూనాలో suvidha.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా నామినేషన్లు దాఖలు చేసే అవకాశాన్ని ఈ ఏడాది కల్పించిందని వివరించారు. అన్ని జిల్లాల నోడల్ అధికారులతో గురువారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెబ్ సైట్ వినియోగంపై అవగాహన కల్పించారు. నోటిఫికేషన్ తర్వాత ఈ సైట్‌లో ఆయా అభ్యర్థులు అన్ని వివరాలను నమోదు చేసి, నిర్ణీత సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, నామినేషన్ల దాఖలుకు చివరి రోజులోగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పత్రాలు అందిస్తేనే నామినేషన్ దాఖలు చేసినట్లు భావిస్తామని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, 16 మంది నోడల్ అధికారులైన ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసన్నలక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు చిట్టి రాజు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి చెన్న కేశవరావు, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'ప్రజల ఆరోగ్యమే రాష్ట్రానికి సౌభాగ్యం'



సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభిస్తున్న రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.స్వామినాయుడు

శ్రీకాకుళం: ప్రజల ఆరోగ్యమే రాష్ట్రానికి సౌభాగ్యమని, అందుకు ఈ రోజు నుంచి రిమ్స్ అందిస్తున్న సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు నిదర్శనమని రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.స్వామినాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి, వైద్య కళాశాల ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను గురువారం స్వామినాయుడుతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటాచలం ప్రారంభించారు. ఇందులో భాగంగా 6 విభాగాల్లో (కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, అంకాలజీ, సీటీ సర్జరీలు) వైద్య సేవలను జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో వారానికి రెండు రోజులు ప్రత్యేకంగా ఓపీ వైద్య సేవలను అందించనున్నారు.

జిల్లాలో తొలిసారిగా ఆరు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభించడంతో ఒక ప్రభుత్వ వైద్యుడిగా ఆనందకరమైన సందర్భమని డాక్టర్ స్వామినాయుడు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సునీల్‌నాయక్, యంవీ సత్యానంద్, వీబీ సుభాషిణి, సంబంధిత విభాగాధిపతులు పాల్గొన్నారు.


శరణు శరణు

నిద్దాలమ్మ తల్లికి మహిళలు ముర్రాటలెత్తారు. గ్రామమంతా ఊరేగింపుగా తిరిగి అమ్మకు మొక్కు చెల్లించారు. ముర్రాటలు సమర్పించడంతో గురువారం నిద్దాలమ్మ తల్లి మహోత్సవాలు ముగిశాయి.

– జి.సిగడాం



ముర్రాటలతో బారులు తీసిన మహిళలు



అమ్మవారి నిజరూపం

క్లుప్తంగా

మార్చి 1న సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టులకు ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో నాలుగేళ్ల సమీకృత డిగ్రీ కోర్సులో బోధించేందుకు సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. వర్సిటీలో గురువారం వివరాలు వెల్లడించారు. మార్చి ఒకటో తేదీన 10 గంటలకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మ్యాథ్స్, ఒడియా సబ్జెక్టులు బోధన అర్హతలు గలవారు నేరుగా హాజరు కావాలని సూచించారు. విశ్వవిద్యాలయం నిబంధనల మేరకు వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర..



అయోధ్యకు సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు మిత్రులు

కాశీబుగ్గ: అయోధ్య రామమందిర దర్శనానికి ముగ్గురు మిత్రులు సైకిల్ యాత్ర మొదలుపెట్టారు. తుని నుంచి అయోధ్యకు 1500 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. గురువారం సాయంత్రానికి పలాసకు చేరుకున్నారు. రెస్టారెంట్‌ను నడుపుతున్న బుద్ధ రాజు, నిట్ల శ్రావణ్, దొడ్డి ప్రసన్న అనే మిత్రులు అయోధ్య రాముడిని దర్శించుకోవడానికి సైకిల్ యాత్ర చేపడుతున్నామని తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో పోలీస్ కమాండెంట్ గౌతమి షాలి



కమాండెంట్ గౌతమికి ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విశాఖపట్నం స్పెషల్ పోలీస్ కమాండెంట్ గౌతమి షాలి గురువారం తొలిసారిగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ వివరించారు.

బీసీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా కేవీఎస్ నాయుడు



మాట్లాడుతున్న అధ్యక్షుడు కేవీఎస్ నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా కేవీఎస్ నాయుడు (బుజ్జి) నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జాతీయ అధ్యక్షులు జస్టిస్ ఈశ్వరమ్మ ఆదేశాలతో స్టేట్ సోర్స్ పర్సన్ బొడ్డేపల్లి దామోదరరావు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ నాయుడు మాట్లాడుతూ ఏఐబీసీఎఫ్‌ని మరింత బలోపేతం చేయడానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు, ఏఐబీసీఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారు బోల్తా



బోల్తాపడిన కారు

సరుబుజ్జిలి: మండలంలోని షళంత్రి, సవళాపురం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి కల్వర్టు వద్ద బుధవారం అర్ధరాత్రి దాటాక కారు బోల్తా పడింది. కొత్తూరు మండలం మెట్టూరు గ్రామానికి చెందిన పెద్దిన వినోద్‌కుమార్ భార్య, ఇద్దరు పిల్లలతో విశాఖ నుంచి కారులో స్వగ్రామానికి వస్తున్నాడు. దారిలో కుక్క అడ్డు రావడంతో కారు అదుపు తప్పి కల్వర్టు మీదుగా పక్కనే ఉన్న చెరువులో బోల్తాపడింది. ప్రమాదంలో వినోద్‌కుమార్, ఆయన భార్య, పిల్లలు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. 108 కు సమాచారం అందించి ఆస్పత్రికి చేరుకున్నారు.

స్వల్పకాలిక కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రంలో నాలుగునెలల స్వల్పకాలిక కోర్సయిన డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్మోహన్‌రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీఎల్‌టీసీలో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్ ద్వారా కోర్సులను అందిస్తున్నామన్నారు. ఇంటర్ పాసై 18 నుంచి 27 ఏళ్ల వయస్సు కలిగిన యువత ఈనెల 26వ తేదీ సాయంత్రంలో ఈ కోర్సుల్లో చేరేందుకు డీఎల్‌టీసీ శిక్షణ సంస్థలోని కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. వివరాలకు 9885960809 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇంద్రజాలం.. మనసుకు గాలం

- ఒకనాడు వెలుగు వెలిగిన ఇంద్రజాల విద్య
- నేడు తగ్గిన ఆదరణ
- ఇంద్రజాలంతో మూఢ విశ్వాసాలపై పోరు
- నేడు పీసీ సర్కార్ జయంతి

శ్రీకాకుళం కల్చరల్:

చేతి రుమాలు నుంచి పావురం రావడం, గ్లాసులో పోసిన డ్రింకులు మాయం కావడం, ఉత్తి చేతి నుంచి నిప్పు రవ్వలు రాల్చడం..ఒకనాటి సమాజాన్ని అబ్బురపరిచాయి. మ్యాజిక్ షో అంటూ అన్నీ మర్చిపోయి మెజీషియన్ ముందర కూర్చునేంత ఖ్యాతి గడించాయి. కానీ కాలం మారింది. టక్కుటమార విద్యలోని రహస్యాలన్నీ మెల్లగా బహిర్గతమైపోయాయి. సీక్రెట్లు తెలిసిపోయాక ఇంద్రజాలం అంత మజా ఇవ్వడం లేదు. నేడు ఈ ప్రదర్శనలకు ఆదరణ తగ్గింది. కానీ అక్కడక్కడా మ్యాజిక్ షోలతో మూఢ నమ్మకాలను పారదోలుతున్నారు. నేడు పీసీ సర్కార్ జయంతి. అందుకే ఇంద్రజాల ప్రదర్శకుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. జిల్లాలోనే పేరెన్నికగన్న మెజీషియన్లు ఎందరో ఉన్నారు.



మనిషిని ముక్కలు చేసి చూపిస్తున్న శ్రీనివాసరాజు (ఫైల్)

మాయలోడు

జిల్లాలో ఇంద్రజాల ప్రదర్శకులు కొద్దిమందే అయినా మొదటి కళాకారుడిగా బేతా శ్రీనివాసరాజునే అంతా గుర్తు చేసుకుంటారు. చిన్న వయసు నుంచి ఇంద్రజాల ప్రదర్శనపై మక్కువతో అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయి కళాకారుడిగా ఎదిగారు. ఈయన ప్రస్తుతం విద్యాశాఖలో పనిచేస్తున్నారు. అపర ఆంధ్రాసర్కార్‌గా, మాంత్రిక రాజగా బిరుదులు పొందారు. ఒవైపు ప్రదర్శనలు, మరోవైపు సేవా కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు, ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఇంద్రజాలాన్ని జోడించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఎం.ఎం. చాంద్ బాషా వద్ద ఇంద్రజాల విద్యను నేర్చుకున్నారు. కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేసిన కె.శంకరరావు వద్ద మెలకువలు నేర్చుకున్నారు. స్టేజిపైన మెలకువలను జాతీయ మిమిక్రీ కళాకారుడు ఎల్. నందికేశ్వరరావు వద్ద నేర్చుకున్నారు. దేశవ్యాప్త ప్రదర్శనలు అనేకం ఇచ్చారు. మనిషిని పెట్టిలో ఉంచి అందరూ చూస్తుండగానే ముక్కలుగా ఆ పెట్టెను వేరుచేసి, అలా వేరు చేసిన భాగాలతో మేజిక్ చేయడం ఈయన ప్రత్యేకత. 1993లో లాతూర్ భూకంపం సంభవించినపుడు అప్పటి కలెక్టర్ అనీల్‌చంద్ర పునేఠా ప్రోత్సాహంతో కళ్లకు గంతలు కట్టుకుని జిల్లా వ్యాప్తంగా 1000 కిలోమీటర్లు మోటారు సైకిల్ యాత్ర చేశారు. రూ.లక్ష విరాళాన్ని సేకరించి వితరణ చాటారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2000 సంవత్సరంలో 3209 కిలోమీటర్లు దూరం కళ్లకు గంతలు కట్టుకుని కారు నడుపుతూ ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ ప్ర దర్శనలో లక్ష సంతకాల సేకరణ చేసి అప్పటి గవర్నర్ రామేశ్వర ఠాకూర్, ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈయన 3000 పైగా ప్రదర్శనలు ఇచ్చారు.

మూఢ నమ్మకాలపై యుద్ధం



ప్రదర్శనలో ఉమామహేశ్వరరావు

ప్రజల్లో ఉన్న మూఢవిశ్వాసాలను పారద్రోలడానికి తన వంతు కృషి చేస్తున్నారు పట్టణంలోని చింతనిప్పుల ఉమామహేష్. తన సోదరుడు ఉత్తమ్ ఒక ఆశయ సాధన కోసం పనిచేస్తుంటే తాను మరొక ఆశయంతో ఈ ఇంద్రజాల ప్రదర్శన కళ ద్వారా సమాజానికి సేవ చేస్తున్నారు. అవేక్ సంస్థను స్థాపించి దాని ద్వారా గ్రామీణ మారుమూల ప్రజలలో ఉన్న మూఢాచారాలు, అంధ విశ్వాసాలపై ఎన్నో ఏళ్లుగా చైతన్య పరుస్తున్నారు. చిల్లంగి, బాణామతి వంటి అవాంఛనీయ సంఘటన ఎక్కడ జరిగినా ఆ గ్రామాలకు వెళ్లి పోలీసుల సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ప్రదర్శనలు తిలకించిన పి.సి.సర్కార్, జాదుగర్ ఆనంద్, బి.వి.పట్టాభిరాంలు అభినందించారు కూడా. తన మేజిక్‌లో మంత్రగాళ్ల, బాబాలు ప్రదర్శించే మహత్యాల వెనుక ఉన్న రహస్యాలను వివరిస్తారు. నోట్లోంచి శివలింగం సృష్టించడం, గాల్లో విభూది సృష్టించడం వంటి వాటిపై ప్రదర్శన చేసి వివరిస్తారు.



మ్యాజిక్ చేస్తున్న ప్రసాద్

ప్రదర్శనలే వృత్తి ప్రవృత్తి

శ్రీకాకుళంలోని గోల్కొండరేవు వీధి, బొడెమ్మ కోవెల వెనుక నివాసముంటున్న మలిపెద్ది దేవేంద్ర ప్రసాద్ వృత్తిగా ఇంద్రజాలాన్ని ఎంచుకున్నారు. 25 ఏళ్లుగా స్వయం కృషితో ఇంద్రజాల ప్రదర్శనలు నేర్చుకున్నారు. డిగ్రీ చదివినా ప్రభుత్వ ఉద్యోగం లేక తనకు ఇష్టమైన కళను నేర్చుకొని వాటిని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికి 5వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఈయన ప్రదర్శనలో ప్రత్యేకంగా నీళ్లను పూలుగా మార్చడం, ఖాళీ డబ్బాలోంచి అనేక వస్తువులు, నోట్లు పుట్టించడం, ఖాళీ చేతులలో నుంచి పావురాలను సృష్టించడం, మనిషి తలపై టీ తయారు చేయడం బాగా పేరు పొందాయి. గాలిలో విభూది సృష్టించే బాబాలు ఉన్న ఈ రోజుల్లో వీటిని బూటకంగా తన ప్రదర్శనలో ప్రచారం చేస్తుంటారు.



పావురాన్ని సృష్టిస్తున్న కేశవ్

'అకడమిక్ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి'

ఎచ్చెర్ల క్యాంపస్:



మాట్లాడుతున్న వీసీ కేఆర్ రజిని

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో అకడమిక్ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ వీసీ కార్యాలయంలో ఆమె గురువారం మాట్లాడారు. ప్రస్తుతం ఆర్ట్స్, కామర్స్, లా కోర్సులకు సంబంధించి క్లాస్‌వర్క్ సమయం మార్చినట్లు చెప్పారు. ఈ నెల 20 నుంచి 11 కోర్సులకు సంబంధించి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.10 గంటల వరకు క్లాస్‌వర్క్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ విద్యార్థులు పోటీ పరీక్షలకు చదవటం, పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకోవటం వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. సైన్స్, ఇంజినీరింగ్ కోర్సులకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు క్లాస్‌వర్క్ జరుగుతుందని, ఈ సమయం మార్పునకు సంబంధించి విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని తెలిపారు. సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయోగాలకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో క్లాస్‌వర్క్ నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదుల ఆధారంగా గత వీసీ నియమించిన 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామక ప్రక్రియ, 24 కాంట్రాక్టు బోధకుల తొలగింపు, వారిలో నచ్చిన వారిని కొనసాగించటం, 2008 నుంచి వర్సిటీలో చేపట్టిన నియామకాలు, పాటించిన రిజర్వేషన్ రోస్టర్‌కు సంబంధించి నియమించిన ఉదయ్‌భాస్కర్, అనురాధ, స్వప్నవాహిణి కమిటీలు నివేదికలు ఈ నెల చివరి నాటికి అందజేస్తాయని అన్నారు. ఈ నివేదికలు పాలక మండలి సమావేశంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. గత పాలక మండలి సభ్యుని భార్య ఇంజినీరింగ్‌లో కాంట్రాక్టు పద్ధతిలో అక్రమ అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకంపై దర్యాప్తు చేయనున్నట్లు చెప్పారు. పారదర్శక, అవినీతి రహిత విశ్వవిద్యాలయం లక్ష్యమని పేర్కొన్నారు. వర్సిటీకి నాక్ బి గ్రేడ్ ఉందని, బీ ప్లస్ గ్రేడు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. లైబ్రరీని పూర్తిగా విద్యార్థుల అవసరాలను అనుగుణంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి శనివారం పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు ఎలాంటి సమస్యలు ఎదురైనా గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఆమెతో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



సోంపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీ పరిధిలోని కండ్ర కులానికి చెందిన 53 కుటుంబాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ సమక్షంలో గురువారం పార్టీలో చేరాయి. ఆకుల భైరవి, నాగుల సింహాచలం, నాగుల జగన్నాథం, గణేష్ బెహరా, ఆకుల నవీన్‌కుమార్, రాధా బెహరా, ఆకుల జమున, రవీంద్ర బెహరా, కృష్ణ బెహరా, నాగుల వైదేవీ బెహరా, సింహాద్రి బెహరా తదితర 53 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వారికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సర్పంచ్ నగిరి ప్రభావతి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, ఎంపీటీసీ పొడుగు కామేష్, పార్టీనాయకులు కోటరాజు, సూరాడ పాపారావు, సంగారు గోవిందు, తోట డిల్లీ, మల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మేకప్ తీస్తే పవన్ కల్యాణ్ జీరో



వలంటీర్లకు సేవారత్న పురస్కారాలు అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

పోలాకి: రాజకీయాలు, వ్యక్తిగత జీవితంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన హీరో అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈదులవలస జంక్షన్‌లో గురువారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకుడంటే యువతకు దిశానిర్దేశం చేసేలా ఉండాలే తప్ప... తాను నడుస్తున్న తప్పుడు దోవలోనే అభిమానులు, అనుచరులు ఉండాలని కోరుకోకూడదని పవన్ కల్యాణ్‌కు హితవు పలికారు. తండ్రి మరణం తర్వాత అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు శకుని పాత్ర వహించిన ప్రతిపక్షం పెట్టిన ఇబ్బందులు ఎదుర్కొని వైఎస్ జగన్ నాయకుడిగా ఎదిగారని గుర్తు చేశారు. పవన్‌తోపాటు ఎంతో మంది నటులు సినిమాల వరకే హీరోలని, మేకప్ తీస్తే జీరోలని చురకలు అంటించారు. అనంతరం సేవారత్న పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, జేసీఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు పదోన్నతిపై బదిలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భీమవరంలో ఏఈఈగా పనిచేస్తున్న బి.దివాకరరావుకు డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పించి రంపచోడవరంలో పోస్టింగ్ ఇచ్చారు. ఏలూరు డీ5 సెక్షన్ ఏఈఈ టీ రాజ్‌కుమార్‌కు డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పించి జీలుగుమిల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. నల్లజర్ల డిప్యూటీ ఈఈ డి.రాజుబాబును అమలాపురానికి, చిట్టివలస ఏఈఈ జె.రామును పదోన్నతిపై నల్లజర్ల డిప్యూటీ ఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలలో పనిచేస్తున్న పలువురు అధికారులకు సైతం రెండు రోజుల్లో స్థానచలనం కలిగే అవకాశం ఉందని విద్యుత్ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. జిల్లాల విభజన జరిగినప్పటికీ విద్యుత్ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ (ఉమ్మడి పశ్చిమగోదావరి పరిధి) విభజన ఇప్పటివరకు జరగకపోగా ప్రస్తుతం ఏలూరు ఆపరేషన్ సర్కిల్‌ను విభజిత జిల్లాల ప్రాతిపదికగా ఏలూరు, భీమవరం సర్కిళ్లగా విభజించారని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా మరో నాలుగైదు రోజుల్లో వెలువడే అవకాశం ఉందని విద్యుత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

ఉపాధి మస్టర్ల చించివేత



మండలపరిషత్ ఆవరణలో చించివేసిన ఉపాధి మస్టర్ కాగితాలు

పోలాకి: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన వేతనదారుల మస్టర్ పేపర్ల చింపివేత కలకలం రేపుతోంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొన్ని మస్టర్ కాగితాలు పడి ఉండటాన్ని గమనించిన కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో వాటిని పోస్ట్‌చేసి కార్యాలయంలో తప్పుడు మస్టర్లు వేస్తున్నారంటూ ప్రచారం చేశారు. దీనిపై మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ రమణ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా అవి వెదుళ్లవలసకు చెందిన 2021 సంవత్సరానికి సంబంధించిన మస్టర్లుగా గుర్తించామని అన్నారు. అయితే అవి ఇప్పుడు ఇలా చించివేతకు గురికావటంపై విచారణ చేపడతామని తెలిపారు. పాత మస్టర్లు అయినా సరే ఫైల్ చేయాలే తప్ప ఇలా చింపకూడదని అన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

జలుమూరు: భీష్మ ఏకాదశి సందర్భంగా చిన్నదూగాం పరిధి తిలారు జంక్షన్‌లో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం గురువారం రాత్రి నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా క్రతువు నిర్వహించారు. దేవదాయ శాఖ ఈఓ రాధా కృష్ణ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జగనన్న చేదోడుతో దర్జీలకు మేలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : జగనన్న చేదోడు పథకం ద్వారా రూ. 10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడంతో పాటు స్కూలు పిల్లలకు యూనిఫారాలు కుట్టడం ద్వారా దర్జీలకు ఉపాధి కల్పించి మేలు చేశారని జిల్లా దర్జీల అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు జి.పాపారావు, లక్క సత్యనారాయణ, వీవీ రమణమూర్తిలు పేర్కొన్నారు. ఈ నెల 28న టైలర్స్‌డే సందర్భంగా వారు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రోద్బలంతో జీఓ నంబరు 86 ద్వారా దర్జీలందరూ సొసైటీలుగా ఏర్పడాలని ఆయన పిలుపునివ్వగా రాష్ట్రంలో 300 వరకు సొసైటీలుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నామన్నారు.

ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఏమాత్రం టైలర్ల గురించి పట్టించుకోలేదని మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యాక టైలర్స్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్‌ను కేటాయించడమే కాక దర్జీల ఖాతాల్లో నేరుగా రూ. 10 వేలు వేయడం మరిచిపోలేమన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్లో 300 సొసైటీలను విలీనం చేసి నిధులు కేటాయిస్తే మరింత మేలు జరుగుతుందన్నారు.

రెండు హాస్టళ్లు మంజూరు

హిరమండలం: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్షణ ద్వారా ఎస్టీ విద్యార్థుల కోసం మండలానికి రెండు హాస్టళ్లు మంజూరైనట్లు జిల్లా సర్వశిక్ష అభియాన్ ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ తెలిపారు. గురువారం మండలంలోని సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీ రెవెన్యూ పరిధిలో హాస్టల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సీది, సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీలో ఎస్టీ విద్యార్థులకు ప్రత్యేక హస్టళ్లు రెండు మంజూరయ్యాయని, హాస్టల్ నిర్మాణానికి సుమారు ఎకరా నుంచి రెండెకరాల వరకు స్థలం అవసరమని తెలిపారు. రెవెన్యూ అధికారులతో కలిసి ప్రభుత్వ స్థలం గుర్తించేందుకు పరిశీలన చేస్తున్నామన్నారు. అవసరమైన స్థలం గుర్తించాక తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక్కో హాస్టల్ నిర్మాణానికి సుమారు రూ.2.30కోట్లు చొప్పున నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ఎంఈఓ కె.రాంబాబు, మండల సర్వేయర్, వీఆర్ఓ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



హిరమండలం సుభలయ పరిధిలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

'రాజగోపాలరావు చిరస్మరణీయుడు'



అమర్‌రహే బొడ్డేపల్లి అంటూ నినాదాలు చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ) : వంశధార ప్రాజెక్టు నిర్మాణ సాధకులు, మాజీ పార్లమెంటు సభ్యులు బొడ్డేపల్లి రాజగోపాలరావు చిరస్మరణీయుడని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాళింగ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు (రామారావు) మాస్టారు అన్నారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు 32వ వర్ధంతి సందర్భంగా గురువారం నగరంలోని ఏడురోడ్ల కూడలి, సింహద్వారం వద్ద ఉన్న ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బొడ్డేపల్లి జిల్లాలోని రైతులకు ముద్దుబిడ్డగా చిరస్థాయిగా నిలిచిపోయారని, అన్ని వర్గాల ప్రజలకు ఆప్తునిగా ఉండేవారన్నారు. వెనుకబడిన కులాలను బీసీ, ఓబీసీ జాబితాలో చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొడ్డేపల్లి దామోదరరావు, కేవీఎస్‌నాయుడు, తమిరి ఉమాశంకర్, తిర్లంగి లోకనాథం, దుంపల గోవిందరావు, గురుగుబెల్లి యుగరాజు, బొడ్డేపల్లి నాగేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి



దిలీప్ (ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని తలగాం సచివాలయంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ఎండ దిలీప్(38) విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఆయన బుధవారం రాత్రి పెద్దరోక్కళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రామనగరం వద్ద విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. దీంతో యువకుడిని వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు టెక్కలి శ్రీనివాసగర్‌లో నివాసం ఉంటున్నారు. మృతుడికి భార్య శిరీష, పదేళ్ల కుమార్తె సందీష ఉన్నారు. లైన్‌మెన్ వెంకటరావు నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని మృతుని భార్య శిరీష ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు టెక్కలి ఏఎస్ఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రేకు ఇంటిలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన వస్తువుల వద్ద బాధితురాలు గురువరి ఆప్తో

మెళియాపుట్టి:

మండలంలోని గంగరాజపురం గ్రామానికి చెందిన గురువరి ఆప్తో అనే మహిళ ఇంటిలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించి దుస్తులు, నగదు కాలిపోయాయి. గ్రామస్తులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం ఆమె ఇంటిలో దేవునికి దీపం వెలిగించి.. ఉపాధి హామీ పనికి బయల్దేరారు. తోటి వేతనదారులు ఆ దారిలో వెళ్తుండగా ఆమె ఇంటిలో మంటలు రావడం గమనించారు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలు అదుపు చేశారు. కానీ అప్పటికే చాలా వస్తువులు కాలిపోయాయి. కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న రూ.80వేలు కాలిపోయిందని ఆమె కన్నీరుమున్నీరయ్యారు. ఇంట్లో ఉన్న సామగ్రి, ఆధార్, రేషన్ కార్డులు ఇతరత్రా కాలిపోయాయి. నష్టాన్ని గుర్తించి న్యాయం చేయాలని బాధితురాలు కోరుతున్నారు.